టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

కార్పొరేట్ల కోసమే పనిగంటల పెంపు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

8 గంటల పని దినాన్ని 10 గంటలుగా మారుస్తూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తూ, కార్పొరేట్ల మేలు కోసం తీసుకున్న నిర్ణయం అత్యంత దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ విమర్శించారు. 8 గంటల పని దినాన్ని 10 గంటల పని దినంగా మారుస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం టవర్‌క్లాక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే శుక్రవారం నాడు రాష్ట్ర అసెంబ్లీలో 8 గంటల పని విధానాన్ని 10 గంటలుగా మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 1920వ సంవత్సరంలో స్వాతంత్ర పోరాటంలో 8 గంటల పని దిన విధానాన్ని మహాత్మా గాంధీతో పాటు వివిధ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని గుర్తు చేశారు. అందులో భాగంగానే ఎనిమిది గంటల పనిదినం దేశంలో అమలు జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు దాసోహం అయ్యి కార్మికులకు నష్టం చేసేలా పని గంటలు పెంచడం దుర్మార్గం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై పునరాలోచించి 10గంటల పని దినం నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే అన్ని రంగాల కార్మికులతో కలిసి ఈ సమస్యపై పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గోపాల్, ముత్యాలు, రామాంజనేయులు, వెంకటనారాయణ, మెడికల్‌రెప్స్ యూనియన్ మనోహర్, చంద్ర, సురేంద్ర, విశ్వనాథ్ శివప్రసాద్, బాషా, మహేష్, వెంకట్ రాముడు, ఆటో యూనియన్ నాయకులు ఆజాం బాషా, స్వాతి, పెద్దన్న, నల్లమ్మ, లక్ష్మి, బేబి పాల్గొన్నారు.

ప్లానర్స్.. టిపిఒకు కుదరని సయోధ్య..!

ప్లానర్ ఎర్రపురెడ్డిని సస్పెండ్ చేయాలంటూ టిపిఒ పట్టు - విధులకు హాజరుకాని అధికారి

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంత మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సచివాలయం ప్లానర్స్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టిపిఒ) శిరీషకు నడుమ తలెత్తిన వివాదం నాలుగు రోజులవుతున్నా సమసిపోలేదు. శుక్రవారం నాడు కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో టిపిఒపై పలువురు సచివాలయ ప్లానర్స్ ఫిర్యాదులు చేశారు. టిపిఒ కావాలనే తమను పలు పేరుతో ఇబ్బందులకు గురి చేస్తోందంటూ ప్లానర్స్ కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా అందజేశారు. సమీక్ష ముగిసిన తర్వాత గుమాస్తాల గది వద్ద సచివాలయ ప్లానర్స్‌తో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష వాదులాటకు దిగింది. ఇదే సమయంలో ప్లానర్ ఎర్రపురెడ్డి సైతం ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పనిగట్టుకుని తమపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందంటే ఏమి చేయాలంటూ ఎదురు ప్రశ్నించారు. ఈ వ్యవహారం నడిచి నాలుగు రోజులు అవుతోంది. ఈ వివాదం జరిగినప్పటి నుంచి టిపిఓ శిరీష విధులకు హాజరు కావడం లేదు. కార్పొరేషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నక్ష కార్యక్రమంలో పనిచేసే వారిని సైతం స్విచ్ ఆఫ్ చేసుకుని విధులకు హాజరు కాకుండా సహాయ నిరాకరణ

చేపట్టారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు సంబంధిత సిబ్బందిని ప్రశ్నిస్తే టిపిఒ ఆదేశాల మేరకే తాము ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకున్నామని, కార్యాలయానికి సైతం హాజరు కావొద్దంటూ తమకు చెప్పారంటూ తెలిపినట్లు సమాచారం. సోమవారం సైతం టిపిఒ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకాలేదు. తనపై ఫిర్యాదు చేసిన ప్లానర్స్‌పై చర్యలు తీసుకుంటేగానీ తాను విధులకు రానంటూ సహోద్యోగుల వద్ద టిపిఒ చెప్పినట్లు సమాచారం.

ఆది నుంచి వివాదాలే

టిపిఒపై ఆది నుంచే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తనకు నచ్చని వారిని ఇబ్బందులకు గురి చేయడం ఆమెకు అలవాటుగా మారిందని పలువురు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. నగరంలో సెలవులపై వెళ్లిన ఇద్దరు ప్లానర్స్ విధులకు హాజరుకాకుండా ఆన్‌లైన్‌లో విధులు నిర్వహిస్తున్నా వారికి టిపిఒ అండగా నిలుస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారి అండదండలతోనే ఆమె ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నక్ష సర్వే కార్యక్రమం కార్పొరేషన్‌లో టిపిఒ కారణంగా నిర్లక్ష్యానికి గురవుతోందనే ఆరోపణలున్నాయి. ఈనెల 29వ తేదీలోగా నక్ష సర్వే పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంది. కార్పొరేషన్‌లో ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఇది ఏ మేరకు లక్ష్యం సాధిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్లానర్స్, టిపిఒ వ్యవహారంలో మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, కలెక్టర్ జోక్యం చేసుకుని నక్ష సర్వే ప్రోగ్రాం ముందు సాగేలా చూడాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

డీఎస్పీ కార్యాలయం వద్ద పడుకుని నిరసన తెలుపుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

పోలీసులపై 'జెసి' మండిపాటు

టిడిపి కార్యకర్తలను వేధిస్తున్నారంటూ ఆగ్రహం డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-తాడపత్రి రూరల్

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి పోలీసులపై ఫైర్ అయ్యారు. టిడిపి కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారంటూ మండిపడ్డారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా డీఎస్పీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం అశోక్ పిల్లర్ వద్ద తమ కార్యకర్తలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వస్తున్న సమయంలో, వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా జరిగిన సంఘటనల్లో టిడిపి కార్యకర్తలపై కేసులు నమోదు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. తాడిపత్రి పోలీసులు వారి వైఖరి మార్చుకోకపోతే ఎంత దూరమైనా వెళ్తానంటూ జేసి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. అనంతరం పోలీసులతో ఫోన్లో సంభాషించిన జెసి ప్రభాకర్ రెడ్డి నిరసన విరమించారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-శింగనమల

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంపై దృష్టి సారించి బాధితులకు న్యాయం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాలో సగటున ఏడాదికి 105 కేసులు, ప్రతి మూడు రోజులకు ఒక దళిత, గిరిజనులపై దాడి కేసు ఉంటోందన్నారు. దళిత, గిరిజనులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, అంటరానితనం, వివక్షత కొనసాగుతోందన్నారు. ఇలాంటి సమయంలో వారికి రక్షణగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కొందరు పోలీసులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల నీరుగారుతోందని విమర్శించారు. రాజకీయ, పెత్తందారుల ఒత్తిడితో అనేక కేసులు నమోదు కావడం లేదన్నారు. గార్లదిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నెంబర్ 104/2009 6-10-2009న మాదిగ కొండూరు మునియప్పపై సయ్యద్ బాషా దాడి చేశాడని కేసు నమోదు అయ్యిందన్నారు. నిందితునిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ కూడా ఉందన్నారు. ఈ కేసు నమోదై 16 సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు నిందితున్ని అరెస్టు చేయలేదన్నారు. సమీప భవిష్యత్‌లో నిందితున్ని అరెస్టు చేయలేమంటూ చేతులెత్తేశారంటే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ఎలా అమలు జరుగుతుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇలా ఒక్క తాడిపత్రి సబ్ డివిజన్ పరిధిలో 93 కేసులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. దళిత, గిరిజనులపై దాడులు చేస్తున్న వారిని అరెస్టు చేసి శిక్షించకపోవడం వల్ల దాడులు మరింత పెరుగుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు స్పందించి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల విచారణ సకాలంలో పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం అమలు నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అంబులెన్స్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం సర్వజనాసుపత్రి ఎదుట ఉన్న అంబులెన్స్ డ్రైవర్‌ల సమస్య పరిష్కరించాలని సిఐటియు నగర నాయకులు లతీఫ్, కెవిపిఎస్ నాయకులు జీవరత్నం, విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు ఇమామ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్‌లను కలిసి వినతి పత్రం అందేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి ఎదుట అంబులెన్స్ యూనియన్‌లో రెండు వర్గాలుగా ఏర్పడి తీవ్ర సమస్య నెలకొందన్నారు. డ్రైవర్‌లంతా ఒక యూనియన్‌గా ఉన్నప్పుడు సర్దుకుని ఒకరినొకరు ఉపాధి పొందేవారని, రెండుగా చీలిపోవడం నిబంధనలు ఉల్లంఘిస్తూ బెదిరింపు చర్యలు, దాడులకు పాల్పడుతుండడంతో భయాందోళనలో డ్రైవర్‌లు ఉన్నారని తెలిపారు. జిల్లా యంత్రాంగం స్పందించి అంబులెన్స్ డ్రైవర్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రుక్మిణీపాండురంగస్వామి ఆలయంలో విచారణ

బొమ్మనహాల్ : మండలంలోని ఉంతకల్లు గ్రామంలో వెలసిన రుక్మిణీపాండురంగస్వామి దేవస్థానంలో సోమవా రం దేవాదాయ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఇదే గ్రామానికి చెందిన కెంచప్ప ఫిర్యాదు మేరకు అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరెడ్డి విచారణకు ఆదేశించారు. దీంతో ఆత్మకూరు మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఈవో బాబు, వారి బృందం పాండురంగస్వామి దేవాల యం, కళ్యాణ మండపం, వసతి గృహాలు, మినీ కళ్యాణ మండపం, ఆలయంలో ఆదాయం, ఖర్చులకు సంబంధించి మూడేళ్లుగా జరిగిన రికార్డులు వివరాలను ఇవ్వాలని ఈవో ఆలయ డెవలప్మెంట్ కమిటీ అభ్యర్థులను కోరారు. మూడు రోజుల్లో రికార్డులు అప్పజెబుతామని కమిటీ మెంబర్లు, వారి బృందం తెలిపారు. అర్చకులు, స్వీపర్ల వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే గ్రామ కమిటీ, ట్రస్ట్ కమిటీ, కమిటీ మెంబర్లు పూర్తి వివరాలను సేకరించినట్లు విచారణ అధికారి ఈవో బాబు తెలిపారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని వేపులపర్తి, చెలిమేపల్లి గ్రామాల్లో సోమవారం 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభి యాన్'(ఆరోగ్యవంతమైన మహిళ-శక్తిమంతమైన కుటుంబం) కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణ, మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయ న్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా వైద్య బృం దాలు సేవలు అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ డాక్టర్ అఫ్తాభ్, సూపర్వై జర్ రామలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు ఉపేంద్ర, మృదుల, చైత్ర, దాక్షాయణి, రోజా, ఎఎన్ఎంలు సన్న లింగమ్మ, వన్నూరమ్మ, సువర్ణమ్మ, మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు అనసూయ, వేపులపర్తి మారెక్క, గౌరమ్మ, గోవిందయ్యదొడ్డి మారెక్క, తిమ్మక్క, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులు ప్రారంభం

రాయదుర్గం : దేవీ నవరాత్రుల ప్రారంభం సందర్భంగా సోమవారం పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మ వారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయదుర్గం కోటలో వెలసిన నగరేశ్వర కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. నేసేపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. శాంతినగర్‌లోని బన్నీ మహంకాళి ఆలయంలో అమ్మవారిని పూలతో అలంకరించారు. హటకేశ్వరస్వామి దేవాలయంలో సూరె శశిధర్, రామాంజనేయులు దుర్గాదేవి పురాణం చదవగా, పురుషోత్తం సఫారే వ్యాఖ్యానం చేశారు. గద్వాల్ ఎల్లమ్మ, కూరగాయల మార్కెట్ సమీపంలోని బన్నీ మహంకాళి ఆలయం, లక్ష్మీ బజార్‌లోని కోర్టు వద్ద గల ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

'సేవ్ ఆర్‌డిటి' నిరసన ర్యాలీ చేస్తున్న భీమ్ సేవా సమితి

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

ఆర్‌డిటి విదేశీ నిధులకు సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఎను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రెన్యువల్ చేయాలని సోమవారం మండలంలోని మురడి గ్రామంలో భీమ్ సేవా సమితి ఆధ్వర్యంలో 'సేవ్ ఆర్‌డిటి' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్‌డిటి 56 ఏళ్లుగా ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో 3,500 గ్రామాల్లో 4.5 లక్షల మంది పేదలకు ఆసరాగా నిలిచిందన్నారు. సుమారు 85వేల గృహా లు, 55వేల మరుగుదొడ్లు నిర్మించిందని, పేద విద్యార్థులకు 40,811 సైకిళ్లు పంపిణీ చేసిందన్నారు. వేలాది మంది విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహకారం అందించిందన్నారు. ఆసుపత్రులు ఏర్పాటుచేసి లక్షలాది మందికి మెరుగైన వైద్యం అందించిందన్నారు. వ్యవసాయంలో రైతులకు తోడ్పాటు అందించిందన్నారు. అలాంటి సంస్థను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా ఆర్డీటీ వల్ల లబ్ధి పొందిన వారు గళం విప్పాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి గంగప్ప, భీమ్ సేవా సమితి వ్యవస్థాపకులు బసవరాజు, తిప్పేస్వామి, సంతోష్, భార్గవ్, సోమేష్, హేమంత్, సిడిసి మెంబర్లు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

కలెక్టర్ ఓ.ఆనంద్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలను పారదర్శకంగా సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో అన్ని శాఖ అధికారులు బాధ్యతగా పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ అందే విధంగా కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణన్ శర్మ, డిఆర్ఒ మలోలాతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్లు

అనంతపురం కార్పొరేషన్ : కలెక్టర్ ఓ.ఆనంద్‌ను మున్సిపల్ కమిషనర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. అనంతపురం, తాడిపత్రి, గుత్తి , రాయదుర్గం, కళ్యాణదుర్గం కమిషనర్లు బాలస్వామి, శివరామకృష్ణ, జబ్బర్ మియా, దివాకర్ రెడ్డి, వంశీకృష్ణలు కలెక్టర్‌ను కలిశారు.

ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీని అడ్డుకోండి

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలో కొన్ని ప్రయివేటు ఆసుపత్రులు చికిత్సల పేరుతో రోగుల నుంచి అందిన కాడికి దోచుకుంటున్నారని ఇలాంటి ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం సవేరా ఆసుపత్రిలో మరణించిన వ్యక్తికి చికిత్సలు అందించి డబ్బులు తీసుకున్న ఉదంతం వెలుగులోకి రావడం ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీకి అద్దం పడుతోందన్నారు. ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని ప్రయివేట్ ఆసుపత్రి యాజమాన్యం విచ్చలవిడిగా డబ్బులను వసూలు చేస్తోందన్నారు. సవేరా ఘటన పెద్ద ఎత్తున చర్చనీయాంశం అయినా పాలకులు, అధికార యంత్రాంగం ఒక్కరు కూడా దీనిపై స్పందించకపోవడం విచాకరం అన్నారు. చర్యలు తీసుకునే అధికారుల కంటే ముందే పోలీసులు హాస్పిటల్ దగ్గరకు వెళ్లి బాధితుల తరుపున న్యాయం చేయకుండా, బాధితులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో వరుస సంఘటనలు జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదంటే ఆసుపత్రుల దోపిడీ సొమ్ములో వారికీ వాటా ఉందని ప్రజలు భావించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అనంతపురం నగరంలో కిమ్స్ సవేరా హాస్పిటల్ చేస్తున్న ఆర్థిక దోపిడీపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అందరూ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యవంతంగా ఉంటుందని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌అలీఖాన్ సూచించారు. స్వచ్ఛత హిసేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పారిశుధ్య కార్మికుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో కార్మికులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా వుంటూ విధులు నిర్వహించాలని మున్సిపల్ అధికారులు సూచించారు. శిబిరంలో పారిశుధ్య కార్మికుల ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్స్‌తో ఉపాధికి గండి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వివిధ కంపెనీలకు చెందిన కార్పొరేట్ సెలూన్స్ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక క్షవర వృత్తిదారుల ఉపాధికి గండిపడుతోందని ఆంధ్రప్రదేశ్ క్షవర వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బి.శ్రీనివాసులు, గుంతకల్ పట్టణ అధ్యక్షులు బెలగంట లక్ష్మినారాయణ, కార్యదర్శి సూరి, కోశాధికారి బ్రహ్మ తెలిపారు. జిల్లాలో కార్పొరేట్ సెలూన్స్‌ను నియంత్రించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ సేవలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కొలిమి వీధిలో ఉన్న 2, 7 సచివాలయాల (పాత మీసేవ కేంద్రం) వద్ద ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకూ ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పని చేస్తాయన్నారు. 5-15 ఏళ్ల లోపు వారు, 15 ఏళ్లు పైబడిన వారు కొత్తగా ఆధార్ నమోదు, బయో మెట్రిక్ అప్‌డేట్, మొబైల్ నెంబర్ లింక్, చేర్పులు, మార్పులు, 60 ఏళ్లు పైబడిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవచ్చు అన్నారు. 2011 నుంచి 2016 వరకూ ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు సమర్పించకుండా ఆధార్ నమోదు చేయించుకున్న వారు కచ్చితంగా ధ్రువీకరణ పత్రాలు సమర్పించి అప్‌డేట్ చేసుకోవాలన్నారను.

టిడ్కో గృహాలు పూర్తి చేయండి : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో అర్ధాంతరంగా ఆగిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో విన్నవించారు. కాలవ మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో గత టిడిపి ప్రభుత్వంలో టిడ్కో గృహాలను చేపట్టారని గుర్తు చేశారు. ఈ ఇళ్ల నిర్మాణం 80 నుంచి 95 శాతం వరకూ పూర్తి చేశామన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. అర్ధాంతరంగా ఆగిన నిర్మాణాలకు రంగులు మార్చి అలాగే వదిలేసిందన్నారు. దాదాపు 1,791 టిడ్కో గృహ నిర్మాణాలు 80 నుంచి 90 శాతం మధ్య ఆగిపోయాయని వివరించారు. వీటిలో ఎక్కువ భాగం తలుపులు, కిటికీలు బిగిస్తే నివాసానికి అనుకూలంగా ఉంటాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వీటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసి పేదల సొంతింటి కలను సాకారం చేయాలని గృహ నిర్మాణ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు.

'యూరియా ఇవ్వలేనప్పుడు పంట మీరే తొలగించండి'..!

ఆర్డీవో ఎదుట రైతు ఆవేదన

'ఓ రైతుకు కేవలం 50 సెంట్ల సొంత పొలం ఉంది. పొరుగు రైతుకు చెందిన మరో ఎకరం భూమి కౌలుకు తీసుకుని 1.5 ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. పంటను కాపాడుకునేందుకు యూరియా కోసం 20 రోజులుగా పట్టణంలోని వివిధ ఎరువుల దుకాణాలకు వెళ్లాడు. ఎక్కడికెళ్లినా యూరియా ఇవ్వాలంటే జింక్ సల్ఫేట్, గంటపీకే మాత్రలు కొనాలని ఎరువుల దుకాణాల యజమానులు షరతు పెట్టారు. దీంతో పంటకు యూరియా వేసుకోలేనని మదనపడిన ఆ రైతు సోమవారం ఏకంగా కళ్యాణదుర్గంలోని ఆర్‌డిఒ కార్యాలయం వెళ్లి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. తనకు ఓ బస్తా యూరియా అయినా ఇప్పించండి.. లేదంటే వరి పంటను మీరే(అధికారులే) తొలగించు కోండని నిరసన తెలపడం చర్చనీయాంశమైంది'.

ఆర్డీవో వసంతబాబుకు వినతి పత్రం ఇస్తున్న రైతు శీనపాయక్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

బ్రహ్మసముద్రం మండలం లోని రాయలప్ప దొడ్డికి చెందిన శీనపాయక్ తనకు ఉన్న 50 సెంట్ల పొలంతో పక్కనే వున్న మరొక రైతు నుంచి ఎకరం కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశాడు. పొట్టదశలో ఉన్న వరి పంటకు యూరియా వేయాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. దీంతో సదరు గిరిజన రైతు కళ్యాణదుర్గం పట్టణంలోని వివిధ ఎరువుల దుకాణాలకు వెళ్లి యూరియా కోసం అభ్యర్థించారు. వారు బస్తా యూరియా ఇవ్వడానికి ఇతర ఎరువులు కొనాలని నిబంధనలు చెప్పుకొచ్చారు. ఓ బస్తా యూరియా కోసం ఇతర మందులు కొనాలంటే సుమారు రూ. 3 వేలు అదనంగా రైతు భరించాలి. ఇంత ఆర్థిక స్తోమత లేని రైతు పంటను కాపాడుకునేందుకు యూరియా దొరకలేదని మనోవేదనకు గురయ్యాడు. విధి లేని పరిస్థితిలో సోమవారం కళ్యాణదుర్గం ఆర్‌డిఒ కార్యాలయం వెళ్లి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ వసంతబాబుకు వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన ఆర్డీవో అక్కడే ఉన్న అగ్రికల్చర్ ఎడిఎ ఎల్లప్పను పిలిచి ఆ రైతు సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఎట్టకేలకు సదరు రైతుకు అధికారులు యూరియా ఇప్పించారు.

యల్లనూరులో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలో పారిశు ధ్యం పడకేసింది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ఎటు చూసినా పేరుకుపోయిన మురికి కాలువలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యమంగ ఆమండల కేంద్రంలోని పాతపేట శివారు, పోతులయ్య కట్ట సమీపంలోని బి సి కాలనీ వద్ద ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు మురికి, చెత్తతో నిండిపోయింది. దీంతో కాలువలో నీరు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అలాగే డ్రెయినేజీలో రాళ్లు, చెత్త అడ్డుపడి మురికినీరు బయటకు వెళ్లని పరిస్థితి. పర్య వేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో పారిశుధ్యం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మురికి నీటికి అడ్డుపడిన రాళ్లు చెత్త

మహిళలతోనే మెరుగైన సమాజ నిర్మాణం

గురజాడ జయంతిలో జెవివి గౌరవాధ్యక్షులు రాచపాళెం

మాట్లాడుతున్న రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహిళలతోనే మెరుగైన సమాజం నిర్మాణం సాధ్యమని జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం జెవివి, ఐద్వా ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ప్రసూన అధ్యక్షతన కెఎస్‌ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆడపిల్ల దేశానికి గర్వ కారణమని, ఆధునిక మహిళ చరిత్రను తిరిగి రాస్తుందన్నారు. మహాకవి గురజాడ అప్పారావు చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని మీరంతా గొప్ప విద్యావంతులై గొప్ప సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. డాక్టర్ పి.ప్రసూన మాట్లాడుతూ గురజాడ అప్పారావు ఆలోచనలతో తన కాలాని కంటే వందేళ్ల ముందున్నాడని, తన రచనలతో ప్రజలను చైతన్య పరచడానికి కషి చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మిరంగయ్య, తెలుగు అధ్యాపకులు రామకృష్ణ, జెవివి జిల్లా నాయకులు మహమ్మద్ జిలాని, గాంగేనాయక్, శ్రీనివాసరావు, నాగరత్న, నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, తిరుపాలు, నాయకులు రామిరెడ్డి, శాంతరాజు, ఐద్వా నాయకురాలు అశ్విని తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్, జెవివి సంయుక్త ఆధ్వర్యంలో

యుటిఎఫ్, జెవివి సంయుక్త గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జెవివి నగర కార్యదర్శి తిరుపాల్, ఐద్వా నగర కోశాధికారి గీత, తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో పరిశోధనలపై ప్రత్యేక దృష్టి

వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయశ్రీ

జ్యోతిప్రజ్వలన చేస్తున్న మెడిక్ కళాశాల ప్రిన్సిపాల్

ప్రజాశక్తి అనంతపురం

వైద్యరంగంలో పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయశ్రీ సూచించారు. సోమవారం స్థానిక అనంత వైద్య కళాశాలలోని సెంట్రల్ హాల్‌లో 2025వ బ్యాచ్ వైద్య విద్యార్థులకు వైద్య విద్య కోర్సు, ప్రాముఖ్యత, సామాజిక బాధ్యత, ఉన్నత అవకాశాలు, పరిశోధనలు తదితర అంశాలపై పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా ఫార్మకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ పద్మ శ్రావణి వ్యవహరించారు. ముందుగా ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శంషాద్‌బేగం, డాక్టర్ షారోన్ సోనియా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్య విద్య ఎంతో పవిత్రమైందన్నారు. లక్షల మందికి ప్రాణం అందించి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతామన్నారు. కావున సామాజిక బాధ్యతతో వైద్య విద్య కొనసాగించాలని సూచించారు. తర్వాత ప్రతి విభాగంలోని వైద్యులు, నూతన వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పద్మ శ్రావణి, రవికుమార్, సరళ, శివశంకర్‌నాయక్, ఆత్మారామ్, దుర్గ, ఎస్.ఉమామహేశ్వరరావు, హైమావతి, పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి చర్యలు చేపట్టాలి : సిపిఎం

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య లోపంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు పాలవుతున్నారన్నారు. పట్టణంలో ఏ వీధి చూసినా చెత్తాచెదరంతో ఉన్నాయన్నారు. దీంతో దోమల బెడద ఎక్కువై ప్రజలు వ్యాధుల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. అలాగే వీధికుక్కలు, పందులు, ఆవులను నియంత్రించాలని కోరారు. లేనిపక్షంలో పట్టణ ప్రజలందరినీ కలుపుకుని మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, సురేంద్ర, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు షాషా, తిమ్మప్ప, శివమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

గుంతకల్లులో సినీనటి నిధి అగర్వాల్ సందడి

షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి నిధి అగర్వాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన సినీనటి నిధి అగర్వాల్ ఆటపాటలతో సందడి చేశారు. ఇందులో భాగంగా కాసం ఫ్యాషన్ 19వ స్టోర్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ అధునాతన కలెక్షన్స్‌తో నిత్యనూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరుగాంచిందన్నారు. అనంతరం మాల్‌లోని లేడీస్, జెంట్స్, కిడ్స్‌వేర్ అంతా కలియతిరిగి సందడి చేశారు. ఆమెను చూసేందుకు యువతీ యువకులు, మహిళలు, పిల్లలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి భద్రత కట్టుదిట్టం చేశారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో గత ఐదేళ్లుగాప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు తెలంగాణ, ఏపీలో 19వ స్టోర్‌ను ప్రారంభించామన్నారు. అధునాతన ఫ్యాషన్ డిజైన్లను వినియోగదారులకు తక్కువ రేటుకే నాణ్యమైన వస్త్రాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసం ఫణి, కాసం సాయికృష్ణ, పుల్లూరు అరుణ్‌కుమార్, విశాల్, వరుణ్, అరుణ్, కార్తీక్, టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తరిమెల పిహెచ్‌సిలో వైద్యులు అందుబాటులో ఉండాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని పిహెచ్‌సిలో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, జిప్సం, జింకు, బోరాన్ వంటి మందులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులందరికీ. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ డబ్బులు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా తరిమెల పిహెచ్‌సిలో 24 గంటలూ డాక్టర్ అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. వీటితోపాటు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, మేకల పెద్దన్న, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, లక్ష్మీపతి, రామాంజనేయులు, భాస్కర్, వెంకటేశు, ఎర్రిస్వామి, సూర్యప్రకాష్, రమణ, సుంకన్న, కొండారెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

తెలుగు రాష్ట్రాల్లో పేదలకు విద్య, వైద్యం అందిస్తూ వరప్రధాయినిగా ఉన్న ఆర్డీటీ సంస్థలను కాపాడాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. ఈమేరకు సోమవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ఆర్డీటీకి సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఎ సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో నిస్వార్థంగా సేవలు అందిస్తూ, పేదల బతుకుల్లో ఆర్డీటీ సంస్థ వెలుగులు నింపిందన్నారు. అలాంటి సంస్థలకు ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించి కాపాడాలని కోరారు.

బలవంతపు భూ సేకరణ ఆపాలి

24న విజయవాడలో ధర్నా - రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూసేకరణ చట్టం అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సోలార్ పేరుతో జరుగుతున్న భూసేకరణతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సోలార్ ప్రాజెక్టులకు భూమి కేటాయించే విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 24వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాకు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సోలార్ కంపెనీలు భూమి కొనుగోలు సందర్భంగా పెడుతున్న నిబంధనలు రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. 30 సంవత్సరాల లీజు ఒప్పందం వల్ల రైతు దీర్ఘకాలంలో భూమి మీద హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల నుంచి భూములు తీసుకున్న సోలార్ కంపెనీ ఆ భూములను బ్యాంకులో తనకాపెట్టి పెద్ద మొత్తంలో రుణం తీసుకుని బ్యాంకుకు తిరిగి చెల్లించకపోతే ఆ భూమిపై రైతు హక్కు కోల్పోతాడన్నారు. రైతుకు సోలార్ కంపెనీకి వివాదం వస్తే కోర్టుకు వెళ్లాలంటే సోలార్ కంపెనీ కార్పొరేట్ సిటీలో ఉండే కోర్టులోనే కేసు వేయాలని నిబంధన ఉంది ఇది పూర్తిగా రైతుకు వ్యతిరేకం అన్నారు. రైతు నివాసం ఉన్న తాలూకా పరిధిలోనే ఉండే సివిల్ కోర్టులో పరిష్కరించుకునే అవకాశం ఉండాలన్నారు. లీజ్ ఒప్పందం పది సంవత్సరాలకు దాటకుండా ఉండాలన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు కౌలు 30 శాతం అదనంగా కలిపి ఇవ్వాలన్నారు. సోలార్ కంపెనీ రైతులతో కుదుర్చుకుంటున్న ఒప్పంద పత్రాలలో రైతుకు వ్యతిరేకమైన సోదర కంపెనీలకు అనుకూలమైనవి ఏవైతే ఉన్నాయో వాటిని ప్రభుత్వం రద్దు చేయాలన్నారు.

రుద్రంపేటలో కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ రుద్రంపేట గ్రామపంచాయతీలో తొలగించిన కార్మికుడు వెంకట రాముడును విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రుద్రంపేట సచివాలయం-1 ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో కార్మికులను విధుల నుంచి తొలగించడం అన్యాయంగా ఉందన్నారు. వెంకటరాముడుతోపాటు మరో ముగ్గురు కార్మికులు తమ పొట్ట కూటి కోసం పంచాయతీ పరిధిలో కాకుండా బయట పని చేశారన్నారు. ఆ సందర్భంగా ట్రాక్టర్ వాడుకున్నారని సాకు చూపుతూ కార్మికులను తొలగించారని తెలిపారు. ఇందులో ముగ్గురు కార్మికులను కొన్ని రోజుల తర్వాత తిరిగి విధులలోకి తీసుకున్నారని, వెంకట్రాముడు మాత్రం తీసుకోలేదన్నారు. వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలవగా స్పందించిన ఆయన వెంటనే కార్మికున్ని మందలించి పనిలోకి తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫారసు చేశారన్నారు. అయినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వెంటనే కార్మికున్ని విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో నిరసన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిఎస్‌పిఇ జెఎసి జిల్లా కన్వీనర్ రాఘవేంద్ర హర్ష

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ శాఖలో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జెఎసి జిల్లా కన్వీనర్ రాఘవేంద్ర హర్ష, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం జేఏసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అంతకు మునుపు విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖ రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా నిరసనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. నల్లబ్యాడ్జీలతో నిరసన, రిలే నిరాహార దీక్షలు చేపట్టామన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు 40 వేలు, 25 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదన్నారు. విద్యుత్ శాఖలో రెగ్యులర్ ఉద్యోగులు 40 వేల మంది, కాంట్రాక్ట్ ఉద్యోగులు 25 వేలు మంది పని చేస్తున్నారని తెలిపారు. ప్రమాదకర విధులు నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి 1999 2004 వరకు చేరిన వివిధ క్యాడర్‌ల ఉద్యోగులకు పెన్షన్ తదితర సౌకర్యాలు అందడం లేదన్నారు. ఇతర శాఖలో పని చేస్తున్న 653, 654 జిఓ ప్రకారం జిపిఎఫ్ వర్తించి పెన్షన్ ఇస్తున్నారని తెలిపారు. విద్యుత్ శాఖలో మాత్రం అమలు కావడం లేదన్నారు. డిఏలు అడుగుతున్నా ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగులకు అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీ అమలు చేయాలన్నారు.

ఆధునిక పద్ధతిలో కిడ్నీ మార్పిడి

సన్ రే ఆసుపత్రి వైద్యుల ఘనత

కిడ్నీ మార్పిడి వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురంలోని సన్‌రే ఆసుపత్రి వైద్యులు ఆధునిక పద్ధతిలో కిడ్నీ మార్పిడి చేసి అరుదైన రికార్డు సాధించారు. ఈమేరకు సోమవారం స్థానిక ఆసుపత్రిలో ప్రముఖ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ వైద్యులు డాక్టర్ సురేంద్రబాబు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రోహిత్‌రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వైఎస్‌ఆర్ జిల్లా పులివెందుల తాలూకు లింగాల మండలం బోనాల గ్రామానికి ఈశ్వరమ్మ (69), తన కొడుకు జలంధర్‌రెడ్డి (52)కి కిడ్నీని దానం చేసి పునర్జన్మను ప్రసాదించి తల్లి మాతృత్వాన్ని సమాజానికి చాటి చెప్పింది. జలంధర్‌రెడ్డికి కిడ్నీ ఫెయిల్యూర్ కావడంతో డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. డయాలసిస్ కంటే కిడ్నీ మార్పిడి ఉత్తమని భావించి కిడ్నీ మార్పిడి కోసం అనంతపురంలో ఉన్న సన్ రే ఆసుపత్రి వారిని సంప్రదించారు. కిడ్నీ మార్పిడి వైద్య నిపుణుడు, నెఫ్రాలజిస్ట్ సురేంద్రబాబు జలంధర్‌రెడ్డి తల్లి ఈశ్వరమ్మను పరీక్షించి దాతగా సరిపోతారని నిర్ధారించి ఈనెల 14వ తేదీన వైద్యుల బృందంతో శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. అనంతపురంలో తొలిసారిగా లాప్రోస్కోపిక్ పద్ధతిలో దాత నుంచి కిడ్నీని సేకరించి రోగికి అమర్చినట్లు వివరించారు. ఆపరేషన్ విజయవంతమై రోగి సోమవారం డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు. అమ్మగా జన్మ ఇచ్చి.. దాతగా పునర్జన్మని ఇచ్చిన ఈశ్వరమ్మని వైద్యుల బృందం అభినందించింది. ఈ కార్యక్రమంలో కిడ్నీ మార్పిడి బృందంతో పాటు మేనేజింగ్ డైరెక్టర్, న్యూరోసర్జన్ రోహిత్‌రెడ్డి, వైద్యులు రామ్మోహన్, స్రవంతి, సిబ్బంది కమల నిరోషా శివ, మేనేజర్ విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టన్ను రూ.15వేలతో అరటి కొనుగోలుకు డిమాండ్

అరటి తోటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

జిల్లాలో రైతులు సాగు చేసిన అరటి పంటను టన్ను రూ.15వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పండ్ల తోటల సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన అరటి పంటను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 27వేల ఎకరాల్లో ఎకరాకు 22 టన్నుల ప్రకారం దాదాపు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల పంటను రైతులు పండిస్తున్నారన్నారు. గతేడాది ఇదే సీజన్‌లో టన్ను రూ.20వేల వరకూ ధర ఉండేదన్నారు. ప్రస్తుతం కనీసం రూ.5వేలకు కూడా అడిగే పరిస్థితి లేదన్నారు. పంట సాగు చేయాలంటే ఎకరాకు దాదాపు రూ.1.50 లక్షల వరకూ ఖర్చు అవుతోందన్నా. ఈనేపథ్యంలో ఒక్కసారిగా ధరలు పండిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ధరలు తగ్గినప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఇదే ప్రభుత్వంలో ఉద్యాన శాఖ ద్వారా అరటి మొక్కలు నాటుకున్న రైతులకు హెక్టార్‌కు రూ.33వేల సబ్సిడీ ఇచ్చేదన్నారు. కావున తిరిగి సబ్సిడీ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఆదినారాయణ, హనుమంతు, వేణు, చిన్న, ఆంజనేయులు, రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'పై నిర్లక్ష్యం

వేళకురాని అధికారులు-ఇబ్బందులు పడ్డ ఫిర్యాదుదారులు

కార్యక్రమంలో సెల్ చూసుకుంటున్న అధికారి

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యలపై పరిష్కార వేదిక కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎందుకంటే ఏ ఒక్క అధికారి కూడా సమయానికి అనుగుణంగా కార్యక్రమానికి హాజరు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం 11 గంటలైనా కొందరు అధికారులు ప్రజా సమస్యలపై పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో పలువురు విస్మయం చెందుతున్నారు. తహశీల్దార్ ఉదయాన్నే వచ్చి కూర్చున్నా ఆయా శాఖల అధికారులు మాత్రం కనిపించడం లేదు. వచ్చిన అరకొర అధికారులు కూడా తమ సెల్‌ఫోన్‌లో బిజీబిజీగా గడుపుతుండటంతో సమస్యలపై విన్నవించేందుకు వస్తున్న ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వినతులను స్వీకరించిన ఎస్పీ

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురి నుంచి ఎస్పీ పి.జగదీష వినతులను స్వీకరించారు. ఇందులో భాగంగా జిల్లా నలమూలల నుంచి సుమారు 110 మంది తమ పిటీషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ చేసి తక్షణ పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

కేక్ కోసి తినిపిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

యువనేత పరిటాల శ్రీరామ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టిడిపి నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ముందుగా మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో కేక్ కోసి పంచిపెట్టారు. తర్వాత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణస్వామి, హిందూపురం పార్లమెంట్ అధికారి ప్రతినిధి శశాంక్‌చౌదరి, మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు, నాయకులు గుండారపు నరసింహచౌదరి, కుళ్లాయప్ప, కందుల ఓబులపతి, రామదాస్, మందుల అక్కులన్న, మూడిండ్ల ఆదెప్ప, ఓబుళపతి, తిక్కస్వామి, సింగంపల్లి శివ, ఉమాపతి, పంపనూరు ఓబుళపతి, అంకే ఆనంద్, వెంకటేష్, బొమ్మయ్య, రవి, రామన్న, పెద్ద లక్ష్మీదేవమ్మ, చెన్నమ్మ, జయశీల, తదితరులు పాల్గొన్నారు.

కాపు, బలిజల సమస్యల పరిష్కారానికి ఉద్యమం

గుత్తి : బలిజ, కాపు వర్గాల సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఉద్యమం కొనసాగిస్తామని రాష్ట్ర కాపు జెఎసి అధ్యక్షులు చందు జనార్దన్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో బలిజ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి, భవిష్యత్తు ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బలిజ కాపు వర్గాలపై కక్షపూరిత ధోరణిని విడనాడాలన్నారు. ముఖ్యంగా గిరి బలిజ జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు సోమ రౌతు రామకృష్ణ, చింతపండు రమణ, మంజు, పూల రమణ, నాగయ్య రాయల్, హరి, టెంకాయల ఈశ్వరయ్య, మోహన్, ఈశ్వర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్‌కుమార్‌కు యంగ్ అచీవ్‌మెంట్ అవార్డు

అవార్డు అందుకుంటున్న గౌతమ్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

27ఏళ్ల వయస్సులోనే ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆధునిక వసతులతో కూడిన వివిఐఎంఎస్ ఫిజియోథెపీ కళాశాల వ్యవస్థాపకులు టి.గౌతమ్‌కుమార్ యంగ్ అచీవ్‌మెట్ అవార్డును అందుకున్నారు. అతి చిన్నవయస్సులోనో ఫిజియోథెరపీ కళాశాలను స్థాపించడంతోపాటు ఎపి తొలి ఫిజియోథెరపీ రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకుడిగా ఆరోగ్య రంగానికి చేసిన సేవలను గురించి అవార్డును ప్రకటించారు. ఈమేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో అవార్డును అందుకున్నారు. గౌతమ్‌కుమార్ రాష్ట్రంలోనే తొలిసారిగా ఫిజియోథెరపీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఫర్ ఫిజియోథెరపీ (ఐఆర్‌ఎఆర్‌పి)ను ప్రారంభించి విద్య, పరిశోధన, పునరావాస రంగాల్లో కొత్తదారులు తెరిచారు. ఫిజియోథెరపీ రంగంలోనే ఆయన చూపిన దూరదృష్టి, సేవలను పలువురు ప్రశంసించారు.

నేరాలు ఘోరాలు

శ్రీగంధం, గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్

రాయదుర్గం : గంజాయి, శ్రీగంధం చెక్కలను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సిఐ జయానాయక్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. స్థానిక కణేకల్లు రోడ్డులోని చంద్రబాబుకాలనీలో నిషేధిత పదార్థాలు ఉన్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. పోలీసులను గమనించిన ముగ్గురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా ముత్తరాశి అనిల్, ముత్తరాసి హరికృష్ణ, మరో మహిళగా గుర్తించారు. గొల్ల అఖిల్‌కు, ముత్తరాశి హరికృష్ణకు కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో అఖిల్‌ను ఏదైనా కేసులో ఇరికించాలని కుట్ర పన్నిన హరికృష్ణ తన మామ ముత్తరాసి అనిల్ సహకారంతో శెట్టూరు మండలం చిన్నంపల్లిలోని ముత్తరాశి శంకర్ వద్ద రూ. 3వేల విలువ చేసే గంజాయిని కొనుగోలు చేసి వాటితో పాటు అక్రమంగా సేకరించిన శ్రీగంధం దుంగలను తీసుకొచ్చి గొల్ల అఖిల్ ఇంటి మెట్ల కింద దాచడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి 584 గ్రాముల గంజాయి, సుమారు 10 కిలోల బరువు గల 9 గంధపు చెక్కలు, కొడవలి, మోటార్ సైకిల్, సెల్ ఫోన్లను స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్‌కు పంపారని తెలిపారు. అలాగే గంజాయి సాగు చేస్తున్న శెట్టూరు మండలం చిన్నంపల్లి గ్రామానికి చెందిన ముత్తరాశి శంకర్ గురించి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొమ్మనహాల్ : మద్యానికి బానిసై పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలం లోని సింగేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. కురుబ మోహన్(40) మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో కుటుంబంలో చిన్న చిన్న కలతలు తలెత్తాయి. దీంతో భార్య, కుమారుడు బుద్ధిగా ఉండాలని మోహన్‌కు సూచించారు. దీంతో మనస్థాపానికి గురైన మోహన్ ఆదివారం పురు గుల మందు తాగి అపారస్మారకస్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన బళ్లారి రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందా డు. మోహన్ భార్య గీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నబిరసూల్ తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామంలో సోమవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో బాలాంజనేయులు, షేక్షావలి ఎదురెదురుగా నివాసం ఉంటున్నారు. అయితే ఇంటిబయట మురుగు నీరు నిల్వ ఉన్న విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి షేక్షావలి, అతడి సోదరుడు హుస్సేన్‌పై బాలాంజనేయులు సోదరులు కర్రలతో దాడి చేశారు. దాడిలో గాయపడిన షేక్షావలి, హుస్సేన్‌ను వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యకేసులో నిందితులు అరెస్టు

పామిడి : పట్టణంలోని షాదీఖానా వెనుక సెప్టెంబర్ 17వతేదీన జరిగిన హత్యకేసులో నిందితులను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ యుగంధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..బెస్త సుధాకర్ ఐచర్ లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈనేపథ్యంలో రోజూ మద్యం తాగి భార్య మీనాక్షితో గొడవ పడుతుండేవాడు. ఇందులో భాగంగానే గత బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య మీనాక్షితో గొడవ పడ్డాడు. దీంతో ఆగ్రహించిన కుమారుడు మహబూబ్‌బాషా రోకలి కర్రతో బలంగా తలపై కొట్టాడు. దీంతో సుధాకర్ చనిపోయాడు. ఈమేరకు మృతుడి భార్య మీనాక్షి, మహబూబ్‌బాషాను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

శ్మశానాల్లో మౌలిక వసతులు కల్పించాలి

బుక్కరాయసముద్రం : శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నాగలింగమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సదాశివకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని శ్మశాన వాటికల్లో ఎక్కడ చూసినా ముళ్లకంపలు పేరుకుపోయాయన్నారు. దీనికితోడు నీటి సౌకర్యం, ప్రహరీలు లేవన్నారు. వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. వీటితోపాటు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

నేడు హుండీల లెక్కింపు

నార్పల : మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి సాకేతపురం శోభ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేరుశనగ పంట నమోదు

గుమ్మఘట్ట : మండల పరిధిలోని కెపి దొడ్డి గ్రామంలో అడుగుపు సాగు చేసిన వేరుశనగ పొలంలో ఈక్రాప్ నమోదు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి నిర్మల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో దాదాపుగా వేరుశనగ 9వేల హెక్టార్లు, 16 వేల హెక్టార్లలో కంది పంట సాగు చేశారన్నారు. ఆయా పంటలను దాదాపు 50శాతం పంట నమోదు పూర్తయినట్లు తెలిపారు. ఈనెలాఖరికి వందశాతం పూర్తి చేస్తామన్నారు .

ఇళ్ల స్థలాలివ్వాలని వినతి

పెద్దపప్పూరు : మండలంలోని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి ఆదినారాయణ కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌ఎస్‌పి మండల అధ్యక్షుడు గోపాల్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు పెద్దిరాజు మాదిగ, ఆది, మురళి, పెద్దన్న, సునీల్, ఆదినారాయణ, పెద్దపెద్దయ్య, శివ, పెద్దన్న, ఓబులనారాయణ, శ్రీరాములు ఉన్నారు.

ఆలూరు సాంబశివారెడ్డికి సన్మానం

నార్పల : వైసిపి అడ్విన్ హెడ్ ఆలూరు సాంబశివారెడ్డిని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప, సోదరులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సాంబశివారెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు, బార్లపై నిఘా

గుత్తి : మద్యం దుకాణాలు, బార్లపై నిరంతరం నిఘా ఉంచాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఉపకమిషనర్ పి.నాగమద్దయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.శ్రీరామ్ సూచించారు. సోమవారం స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నవోదయం 2.0 స్థితి, ఎన్డిపిఎల్, ఎన్డిపిఎస్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు అస్లాం బేగ్ మీర్జా, జి.గోపాల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సొసైటీ సిఇఒపై ఫిర్యాదు

యల్లనూరు : సహకార సంఘ సొసైటీలోని ఎరువులు పక్కదారి పట్టిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న సిఇఒ వీరనారప్పపై చర్యలు తీసుకోవాలని జనసేన మండల కన్వీనర్ జిఎం ఆదినారాయణ సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ రాముకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఇఒ వీరనారప్ప మండల రైతులకు కాకుండా పుట్లూరు, కొండాపురం మండలాల రైతులకు ఎరువులు విక్రయిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ సొసైటీకి సుమారు 250 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని, అయితే మండల రైతులకు ఒక్కరికి కూడా యూరియా బస్తాలు పంపిణీ చేయలేదన్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి సిఇఒపై చర్యలు తీసుకుని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు అందించాలని కోరారు.

ఆర్డీటీ సేవలపై ఆందోళన వద్దు : ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో కొనసాగుతున్న ఆర్డీటీ సేవలపై ఎలాంటి ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యూవల్ చేసేందుకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నారన్నారు. ఆర్డీటీ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు తెలుగు రాష్ట్రాల్లో అందిస్తున్న సేవలు అందరికీ తెలిసిందేనన్నారు. కొన్ని లక్షల కుటుంబాలు ఈ సంస్థపై ఆధారపడ్డాయన్నారు. ఇప్పటికే రాష్ట్ర ఎంపీల ద్వారా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి ఆర్డీటీ విషయాన్ని వివరించామన్నారు. ఇందుకు ఆయన కూడా సానుకూలంగా స్పందించారన్నారు. అయితే తాజాగా దీనిపై ప్రజల్లో ఆందోళన పెరిగిపోతున్న నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ స్వయంగా కేంద్రంతో మాట్లాడుతున్నారని తెలిపారు. ఆర్డీటీ సంస్థ నిర్వాహకులు మాంచూ ఫెర్రర్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌తో సమావేశమై స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ

పుట్లూరు : మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో పంటకోత ప్రయోగంపై గ్రామస్థాయి అధికారులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పంటకోత ప్రయోగాల ప్రాముఖ్యత, అవగాహన కల్పించే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ గణాంక అధికారి విజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి ఆర్.కాత్యాయిని, వ్యవసాయ విస్తీర్ణ అధికారి పి.చిన్ననాగిరెడ్డి, రైతు సేవా కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : పంటకోత ప్రయోగాలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల సహాయ గణాంక అధికారిణి మమత పంటకోత ప్రయోగాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

నార్పల : మండలంలో రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 87 టన్నుల యూరియా వచ్చిందన్నారు. యూరియా కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి తీసుకోవాలని కోరారు.

జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు

గుత్తి : పట్టణంలోని ప్రత్యేక ఉపకారాగారంలో మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సును సోమవారం నిర్వహించారు. ముందుగా జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి,న్యాయమూర్తి ఎన్.రాజశేఖర్ ఉపకారాగారాన్ని తనిఖీ చేశారు. జైలులోని రికార్డులు, బ్యారెకులు, వంటగది, స్టోర్ గది,మరుగుదొడ్డను పరిశీలించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, ప్యానల్ న్యాయవాది వి.సి.గంగాధర్ కుమార్, కోర్టు టైపిస్ట్ ఎస్. సాదిక్ వలి,కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన 'శ్రీధర్స్ సిసిఇ'

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని పాత డిఇఒ కార్యాలయం వద్ద ఉన్న శ్రీధర్స్ సిసిఇలో చదివిన 85 మందిని కానిస్టేబుల్ ఉద్యోగాలు వరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో అభ్యర్థుల మనోభావాలను పంచుకున్నారు. అనంతరం సంస్థ అధినేతలు శేషు కుమార్ అరవింద్ మాట్లాడుతూ శ్రీధర్స్ సిసిఇ అంటే ఒక సంస్థ కాదని.. పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రమన్నారు. తమ సంస్థ ద్వారా వేలాదిమందిని ఉద్యోగులుగా తీర్చిదిద్దినట్లు వివరించారు. సుదీర్ఘకాలంగా బ్యాంకింగ్ రంగంలో ఇదేక్రమంలో పోలీస్ శాఖలో అనేక ఉద్యోగాలను సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పోలీస్ శాఖలోని కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన 85 మంది అభ్యర్థులు సివిల్, ఏపీఎస్పీలో పోస్టింగులు పొందాలని సూచించారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థికి బొకే అందజేస్తున్న శ్రీధర్స్ సిసిఇ సంస్థ ప్రతినిధులు

సమస్యల పరిష్కార వేదికలో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-అనంతపురం

వినతిపత్రం అందజేస్తున్న వైఎస్ఆర్ విద్యార్థి విభాగంనేతలు

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ఓ వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేసి విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌యాదవ్ కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వైఎస్ఆర్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కలెక్టర్ ఓ.ఆనంద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో విద్యార్థి విభాగం నాయకులు మంజునాథ్‌రెడ్డి, వెంకటేష్ రాయల్, నిశాంత్‌రెడ్డి, కైలాష్, ఫయాజ్, అశోక్ రాయల్, ఆదిల్, నవీన్, లోకేష్, వంశీనాయుడు, నరేందర్‌రెడ్డి, చిగండి రమేష్, రాహుల్‌రెడ్డి, సాయియాదవ్, సూర్య, శివ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూడండి

నగరంలోని పెద్దాసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ఓ.ఆనంద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దాసుపత్రిలో సరైన వైద్యం రోగులకు అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కావున వెంటనే స్పందించి పెద్దాసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లిపాలతోనే పిల్లల ఆరోగ్యం

ప్రజాశక్తి -అనంతపురం

చిన్నారులకు తల్లిపాలు పట్టించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సిడిపిఒ అనురాధ సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం అనంతపురం అర్బన్ ప్రాజెక్టులోని నేతాజీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకూ పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీలకు పంపాలన్నారు. అనంతరం పౌష్టికాహారంపై వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమ, అంగన్వాడీ టీచర్ నిర్మల, మహిళా పోలీస్ దివ్య, తల్లులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని ఎస్.గూడూరు అంగన్వాడీ సెంటర్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లావణ్య ఆధ్వర్యంలో సోమవారం పోషకాహార మసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా 3 నుంచి ఆరేళ్ల మధ్య ఉన్న పిల్లల తల్లులకు సమతుల్య ఆహారం, రక్తహీనత, పౌష్టికాహార పద్ధతులపై వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ శ్వేత, అంగన్వాడీ టీచర్లు అనంతలక్ష్మి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని 4వ సచివాలయం వద్ద సోమవారం పౌష్టికాహార మసోత్సవాలు నిర్వహించారు. ఇందులోఓ భాగంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నానారాయణమ్మ గర్భిణులు, బాలింతలు, మహిళలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యమిమభూషన్, సిహెచ్ఒ బాలాజీ, హెల్త్ సూపర్‌వైజర్ అకులప్ప, అంగన్వాడీ కార్యకర్తలు రేణుక, వరలక్ష్మి, అలివేలమ్మ, కుళ్లాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'స్కోచ్' రావడంపై కలెక్టర్ హర్షం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2024-25 సంవత్సరానికి సంబంధించి ఎపిఎంఐపి ద్వారా జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు స్కోచ్ అవార్డు రావడం హర్షించదగ్గ విషయమని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కోచ్ గ్రూప్ ఫౌండర్, ఛైర్మన్ సమీర్ కొచ్చర్‌తో అనంతపురం ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, అప్పటి అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఫిరోజ్‌ఖాన్ అవార్డును స్వీకరించారు. ఈ అవార్డును సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎపిఎంఐపి అధికారులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, ఎపిఎంఐపి పీడీ రఘునాథ్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

స్కోచ్ అవార్డును కలెక్టర్‌కు అందజేస్తున్న దృశ్యం

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలి

శింగనమల : జిల్లా వరప్రదానియిగా ఉన్న ఆర్డీటీ సంస్థకు వెంటనే కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని అఖిల భారత రైతు కూలిసంఘం మండలం కమిటీ నాయకులు తరిమెల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహశీల్దార్ పి.శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రవి, సూరి, శ్రీరాములు, లక్ష్మీరంగయ్య, దుబ్బన్న, స్వరణాగప్ప, రాజశేఖర్, మొబ్బు శ్రీనివాసులు, నాగముని, తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదును పూర్తి చేయండి

బెలుగుప్ప : ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలను వెంటనే ఈక్రాప్ నమోదు చేపట్టాలని తహశీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి పెండింగ్ లేకుండా వందశాతం ఈక్రాప్ నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్‌రావు, ఆర్ఐ మహేష్‌బాబు, వీఆర్వోలు ఈశ్వర్‌రెడ్డి, రమేష్‌స్వామి, ఎర్రిస్వామి, రాజశేఖర్, మధుసూదన్, ఎర్రిస్వామి, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న భగత్‌సింగ్ ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భగత్‌సింగ్ ఆటో యూనియన్ తోటి కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం చేసి మానవత్వం చాటుకుంది. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆటో స్టాండ్‌లో సభ్యుడు మార్కో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో తోటి డ్రైవర్లందరూ బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు సినప్ప, నాగేంద్ర, చిరంజీవి, రాము, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.